RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

## విలేకరులు కావలెను


తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

తెలంగాణ స్టేట్ బ్యూరో పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

సంచిక : 312 | సంపుటి : 02 | మంగళవారం 30-9-2025 | పేజీలు -8 | వెల: రూ. 05.00



## ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి ట్రంప్ షాక్..

- ఇకపై సినిమాలపై 100శాతం సుంకాలు..!

**న్యూఢిల్లీ,**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే భారత ఎగుమతులపై 50శాతం సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా మరో నిర్ణయం తీసుకున్నారు. దాంతో భారతీయ చిత్రాలపై భారీ ప్రభావం పడనున్నది. అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై సుంకాలు అమలు చేయనున్నట్లు హెచ్చరించారు. వందశాతం సుంకాలను విధించనున్నట్లు ప్రకటించారు. విదేశీ సినిమాలపై వందశాతం సుంకాలు అమలుకానున్నాయి. 'మా సినిమా నిర్మాణ వ్యాపారాన్ని అమెరికా నుంచి.. ఇతర దేశాలను ఓ శిశువు నుంచి మిఠాయిని తొలగించినట్లుగా దొంగిలించాయని ఆయన ఆరోపించారు. బలహీనమైన, అసమర్థ గవర్నర్‌తో ఉన్న కాలిఫోర్నియా ముఖ్యంగా తీవ్రంగా దెబ్బతింది అంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఈ దీర్ఘకాల, ఎప్పటికీ అంతం కాని సమస్యను పరిష్కరించడానికి తాను అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై 100శాతం సుంకం విధించనున్నట్లు పేర్కొన్నారు. విదేశీ సినిమాలతో అమెరికన్ సినిమా పరిశ్రమకు 'జాతీయ ముప్పు'గా -మిగతా 2 లో

# గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

## సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం ముందంజ

- ప్రభుత్వంపై బీఆర్ఎస్ బురద జల్లుతూ విమర్శలు
- మండిపడ్డ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్**

బీఆర్ఎస్ పార్టీ తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, కానీ రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలకు తెలుసునని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, -మిగతా 2 లో



## గిన్నిస్ రికార్డు సాధించిన తెలంగాణ బతుకమ్మ

- 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ఏర్పాటు
- ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు
- ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరు

**హైదరాబాద్,**

హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన బతుకమ్మ కార్యక్రమం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించింది. అతిపెద్ద జానపద నృత్యంగా, అతిపెద్ద బతుకమ్మగా రికార్డు సృష్టించింది. గిన్నిస్ రికార్డు సాధనే లక్ష్యంగా సరూర్‌నగర్ స్టేడియంలో సోమవారం బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. 63 అడుగుల ఎత్తయిన భారీ బతుకమ్మ ఏర్పాటు చేశారు. ఒకేసారి 1354 మంది మహిళలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, హైదరాబాద్ -మిగతా 2 లో



# మోగిన స్థానిక ఎన్నికల నగారా


## బిసి రిజర్వేషన్ల జీవో విడుదలతో లైన్ క్లీయర్




- మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహణ
- తొలుత ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు
- తరవాత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కుముదిని

**హైదరాబాద్,**

తెలంగాణలో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. బిసి రిజర్వేషన్లపై భారీ కసరత్తు జరిగినా చివరకు 42 శాతం బిసి రిజర్వేషన్లకు జివో విడుదల కావడంతో స్థానికఎన్నికలకు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో 565 మండలాల్లో 5,749 ఎంపీటీసీ, 656 జడ్పీటీసీ స్థానాలకు, 12,733 గ్రామపంచాయతీలు, 1లక్షా12వేల288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని వివరాలు వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. -మిగతా 2 లో






## స్థానికంలో కాషాయ జెండా ఎగురవేస్తాం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారు
- రెండేళ్లకే కాంగ్రెస్ మీద ప్రజలకు విరక్తి కలిగింది
- పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం మీద ప్రజలు విసిగిపోయారు
- బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు



**హైదరాబాద్,**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలస్యమైనా తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తుందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు రాష్ట్రపతి, గవర్నర్‌ల పేరిట కాలయాపన చేసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండేళ్లకే కాంగ్రెస్ మీద ప్రజలకు విరక్తి -మిగతా 2 లో



## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు షాక్..

- ఉగ్రవాద సంస్థగా ప్రకటించిన కెనడా..!

**న్యూఢిల్లీ,**

కెనడా ప్రభుత్వం బిష్ణోయ్ గ్యాంగ్‌కు షాక్ ఇచ్చింది. బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. ఈ మేరకు కెనడా ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఒక నిర్దిష్ట సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని.. బెదిరింపులకు బెదిరింపు వాతావరణాన్ని సృష్టించే.. హింస, ఉగ్రవాద చర్యలకు కెనడాలో చోటు లేదని ప్రకటనలో ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు పబ్లిక్ సేఫ్టీ మినిస్టర్ గ్యారీ ఆనంద్ సంగారి కెనడా ప్రభుత్వం బిష్ణోయ్ గ్యాంగ్‌ను క్రిమినల్ కోడ్ కింద ఉగ్రవాద సంస్థ జాబితాలో చేర్చిందని ప్రకటించారు. కెనడాలోని ప్రతి వ్యక్తికి వారి ఇంట్లో, సమాజంలో సురక్షితంగా ఉండే హక్కు ఉందని.. బిష్ణోయ్ గ్యాంగ్ భయం, హింస ద్వారా కొన్ని వర్గాలను లక్ష్యంగా చేసుకుంటుందని ఆరోపించారు. ఈ ముఠాను ఉగ్రవాద జాబితాలో ఉంచడం వల్ల వారి నేరాలను అరికట్టడానికి, సమాజంలో భద్రతను నిర్ధారించడానికి -మిగతా 2 లో



## పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీవోకేలో నిరసనలు..

- మౌలిక సంస్కరణలు కోరుతూ అవామీ యాక్షన్ కమిటీ నిరసనలకు పిలుపు
- ఇంటర్నెట్ సేవలు బంద్

**న్యూఢిల్లీ**

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలు తలెత్తాయి. పీవోకేలో ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మౌలిక సంస్కరణలు కోరుతూ అవామీ యాక్షన్ కమిటీ నిరసనలకు పిలుపునిచ్చింది. దీంతో పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. షటర్-డౌన్.. వీల్-జామ్' పేరుతో అవామీ యాక్షన్ కమిటీ పీవోకేలో సమ్మెకు పిలుపునిచ్చింది. ?వేల సంఖ్యలో ప్రజలు నిరసనల్లో పాల్గొన్నారు. -మిగతా 2 లో

## నగరంలో పేదలకు రూ.5కే అల్పాహారం

- రెండుచోట్ల ప్రారంభించిన మంత్రి పొన్నం




**హైదరాబాద్,**

హైదరాబాద్‌లోని పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా క్యాంటీన్' పథకాన్ని రేవంత్ సర్కార్ ప్రారంభించింది. ఈ పథకం ద్వారా కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం, ఐదు రూపాయలకే మధ్యాహ్న భోజనం అందించనున్నారు. మోతీనగర్, మింట్ కాంపౌండ్ ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కూడా పాల్గొన్నారు.ఈ పథకం కింద ఒక్కో అల్పాహారంపై జీహెచ్ఎంసీ రూ. 14, మధ్యాహ్న భోజనంపై రూ. 24.83 భరించనుంది. దీని వల్ల ఒక్కో వ్యక్తిపై నెలకు సుమారు రూ. 3,000 ఆర్థిక భారం -మిగతా 2 లో

# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు

## ఆరు గ్యారెంటీలతో మోసం చేసిన రేవంత్ సర్కార్

- కాంగ్రెస్ మోసాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రజలు
- ఏ ఎన్నికలు వచ్చినా గెలిచి తీరుతాం : కేటీఆర్



**హైదరాబాద్,**

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ప్రదీప్ చౌదరితోపాటు పలువురు వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్సీ ఎల్.రమణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కేటీఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. -మిగతా 2 లో

# ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి ట్రంప్ షాక్..

(మొదటి తరువాయి)

ట్రంప్ భావిస్తూ ట్రంప్ మే ఇలాంటి ప్రకటన చేశారు.ఇదిలా ఉండగా.. గతంలో ట్రంప్ అమెరికాలో షూటింగ్ జరుపుకోని సినిమాలపై ఏకంగా వందశాతం సుంకాలు విధించనున్నట్లు గతంలో ప్రకటించారు. పలువురు నిర్మాతలతో హాలీవుడ్ నష్టపోతుందన్న ట్రంప్ విదేశాల్లో చిత్రీకరణ జరిపి.. అమెరికాలో రిలీజ్ అయ్యే చిత్రాలపై వెంటనే 100 శాతం సుంకాలను విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కు ఆదేశాలు జారీ చేశారు. అమెరికా చలన చిత్ర పరిశ్రమను పునరుద్ధించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సమయంలో ట్రంప్ ప్రకటించారు. అయితే, చాలా దేశాలు అమెరికన్ స్టూడియోలు, చిత్రనిర్మాతలను ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ఇది అమెరికా ఆర్థిక, జాతీయ భద్రతకు ముప్పు కలిగించడమేనని ట్రంప్ అన్నారు. అమెరికన్ సినిమా ఇండస్ట్రీ చాలా వేగంగా తగ్గుతోందని.. మళ్లీ అమెరికా గడ్డపై సినిమాల షూటింగ్ జరగాల్సిన రోజులు రావాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఇటీవల కాలంలో సినిమా, టెలివిజన్ నిర్మాణం హాలీవుడ్ నుంచి యూకే, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాలకు తరలిపోతున్నాయి. ఆయా దేశాలు పన్ను ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. దాంతో ఆయా దేశాలకు సినిమా రంగం తరలిపోతున్నది. దాంతో షూటింగ్ ఖర్చు తగ్గుతుంది. కొన్ని సినిమాలు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరుగుతుంటాయి. ఈ క్రమంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద చిత్ర మార్కెట్ చైనాకు ఉంది. ఇదిలా ఉండగా.. అమెరికాలో భారతీయ సినిమాలు పెద్ద సంఖ్యలో విడుదలవుతుంటాయి. తెలుగు సినిమాలు సైతం విడుదలయ్యే విషయం తెలిసిందే. ట్రంప్ నిర్ణయంతో తెలుగు సినిమా ఇండస్ట్రీపై సైతం ప్రభావం పడే అవకాశం ఉంది. అక్కడ సినిమా విడుదల చేయాలంటే ఇకపై వందశాతం పన్ను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా.. ఇటీవల ట్రంప్ భారత ఫార్మా ఉత్పత్తులపై అక్టోబర్ ఒకటి నుంచి వందశాతం శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాలో తయారయ్యే ఫార్మా ఉత్పత్తులకు మాత్రం సుంకాలు ఉండబోవని స్పష్టం చేశారు. అయితే, ప్రతి సంవత్సరం భారత్ నుంచి అమెరికాకు 10 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి జరుగుతాయి. ఫార్మాతో భారీ ట్రక్కులు, కిచెన్ క్యాబినెట్, బాత్రూమ్ వానిటీలతో పాటు పలు వస్తువులపై 50శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

## గిన్నిస్ రికార్డు సాధించిన తెలంగాణ బతుకమ్మ

(మొదటి తరువాయి)

మేయర్ గద్వాల విజయలక్ష్మి తదితరులు హాజరయ్యారు. భారీ బతుకమ్మ చుట్టూ మహిళలు లయబద్ధంగా ఆడారు. మంత్రి సీతక్క బతుకమ్మపాట పాడి అలరించారు.

## స్థానికంలో కాషాయ జెండా ఎగురవేస్తాం

(మొదటి తరువాయి)

కలిగిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వం మీద ప్రజలు విసిగిపోయారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురువేస్తామని ధీమా వ్యక్తం చేశారు రాంచందర్ రావు తమ గెలుపునకు స్థానిక సంస్థల ఎన్నికలే నిదర్శనం కాబోతున్నాయని ఉద్ఘాటించారు. తమకు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. తాను స్వయంగా ఇప్పటివరకు 23 జిల్లాల్లో యాత్రలు చేశానని తెలిపారు. ఇంకో నాలుగు జిల్లాల్లో యాత్ర చేయాల్సి ఉందని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను తామే గెలువబోతున్నామని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీవోకేలో నిరసనలు..

(మొదటి తరువాయి)

ఈ మేరకు పీవోకేలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ ఏఏసీ పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచింది. తమ ఆందోళనలు ఏ సంస్థకూ వ్యతిరేకం కాదని ఏఏసీ కీలక నాయకుడు షౌకత్ నవాజ్ మీర్ అన్నారు. 70 ఏళ్లకుపైగా పీవోకేలోని ప్రజలకు ప్రాథమిక హక్కులు కూడా కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు హక్కులను అందించడం ప్రభుత్వం బాధ్యత అని అన్నారు.పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా తమను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. 'మా హక్కులు మాకు కల్పిస్తారా.. ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొంటారా..?' అంటూ హెచ్చరించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే నిరసనలను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది. ఈ నిరసనలతో పాక్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పీవోకేలో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించింది. ఆందోళనల నేపథ్యంలో పీవీకే ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు. చెక్ పోస్టులు, ప్రధాన ప్రాంతాల్లో పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు.

## నగరంలో పేదలకు రూ.5కే అల్పాహారం

(మొదటి తరువాయి)

తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అల్పాహారం కోసం 'హరే రామ, హరే కృష్ణ' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సాధారణంగా రూ. 19 ఖర్చయ్యే టిఫిన్‌ను కేవలం రూ. 5కే, అలాగే రూ. 30 ఖర్చయ్యే భోజనాన్ని రూ. 5కే అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మొదటగా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా.. గత 10 సంవత్సరాలుగా లేని రేషన్ కార్డులు తమ ప్రభుత్వం అందించిందని, అలాగే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. అంతేకాకుండా మహిళా సాధికారత కోసం రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సోలార్ ఎ÷-లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల యజమానులుగా చేసే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యుల సంఖ్యను 16 నుంచి 65 వరకు మార్చి, సున్నా వడ్డీకే రుణాలు ఇస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా.. హైదరాబాద్‌లో పనిచేసే వారికి అక్కడే ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని.. కొల్లూరులో ఇళ్లు నిర్మించి ఇవ్వడం వల్ల ఉపయోగం ఉండదని అన్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ.. ఇందిరా క్యాంటీన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# మోగిన స్థానిక ఎన్నికల నగారా

(మొదటి తరువాయి)

తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్ఈసీ తెలిపారు. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాణికుముదిని వివరించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది ఎన్నికల కమిషన్. ఇందుకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరిపామన్నారు ఎన్నికల అధికారులు. ఇక ఎన్నికల్లో భాగంగా 565 మండలాల్లో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికలు మొత్తం మూడు దశల్లో జరగనున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ 23న ఎంపీటీసీ, జడ్పీటీసీమొదటి విడత ఎన్నికలు జగనున్నాయి. ఇక అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ రెండో దశ ఎన్నికలు జరగనుండగా.. అక్టోబర్ 31న మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 4న రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జగనున్నాయి. ఇక చివరగా నవంబర్ 8న మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు ముగిసిన తర్వాత నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ జరగనుంది. మొత్తంగా రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీనితో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. అయితే రాష్ట్రమంతటా ఎన్నికల సందడి మొదలవగా కొన్ని గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించబోవడం లేదని ఎస్ఈసీ ప్రకటించింది. కరీంనగర్, ములుగు జిల్లాల్లో 14 ఎంపీటీసీ, 27 గ్రామ పంచాయతీలకు 246 గ్రామ వార్డులు ఎన్నికలకు దూరంగా ఉండనున్నాయని స్పష్టం చేశారు. కోర్టు కేసుల కారణంగా ఇక్కడ ఎన్నికల నిర్వహణ సాధ్యం కావడం లేదని, హైకోర్టు ఆదేశాల మేరకు ఈ స్థానాల్లో ఎన్నికలు జరగబోవని తెలిపారు. ములుగు జిల్లాలోని 25 గ్రామ పంచాయతీలు, కరీంనగర్ జిల్లాలోని 2 పంచాయతీలకు ఎన్నికలు లేవని స్పష్టం చేశారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- తొలివిడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11
పరిశీలన: అక్టోబర్ 12
నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 15
ఎన్నికల తేదీ- అక్టోబర్ 23
ఓట్ల లెక్కింపు- నవంబర్ 11

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- రెండో విడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15
పరిశీలన: అక్టోబర్ 16
నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 19
ఎన్నికల తేదీ- అక్టోబర్ 27
ఓట్ల లెక్కింపు- నవంబర్ 11

గ్రామ పంచాయతీ ఎన్నికలు- తొలి విడత
నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 17
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 19
పరిశీలన: అక్టోబర్ 20
నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 23
ఎన్నికల తేదీ, ఫలితాలు- అక్టోబర్ 31

గ్రామ పంచాయతీ ఎన్నికలు-రెండో విడత
నామినేషన్ల స్వీకరణ- అక్టోబర్ 21
చివరి తేదీ: అక్టోబర్ 23
పరిశీలన: అక్టోబర్ 24
నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 27
ఎన్నికల తేదీ, ఫలితాలు- నవంబర్ 4

గ్రామ పంచాయతీ ఎన్నికలు-మూడో విడత
నామినేషన్ల స్వీకరణ- అక్టోబర్ 25
చివరి తేదీ: అక్టోబర్ 27
పరిశీలన: అక్టోబర్ 28
నామినేషన్ల ఉపసంహరణ- అక్టోబర్ 31
ఎన్నికల తేదీ, ఫలితాలు- నవంబర్ 8

# గత పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

(మొదటి తరువాయి)

మనసులకు బాగా తెలుసు అని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చిందని ఆయన అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బీసీలకు 42? రిజర్వేషన్ కల్పించామన్నారు. ప్రజల కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బీఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదు అన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేకపోయారని డిప్యూటీ సీఎం విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిందన్నారు. యువతకు




గ్రూప్ 1, గ్రూప్ 2 తో పాటు ఇప్పటికే 60,000 ఉద్యోగాలు, 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్, 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 1.05 కోట్ల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం, బహిరంగ మార్కెట్లో 56 రూపాయలు కిలో ధర పలుకుతున్న సన్నబియ్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసి ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తున్నాం అన్నారు.

# లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు షాక్..

(మొదటి తరువాయి)

సమర్థవంతమైన అవకాశం ఉంటుంది. క్రిమినల్ కోడ్ కింద కెనడాలో ప్రస్తుతం మొత్తం 88 ఉగ్రవాద సంస్థలు జాబితా అయ్యాయి.క్రిమినల్ కోడ్ ప్రకారం.. కెనడాలోని బిష్నోయ్ ముఠాల ఆస్తులు, వాహనాలు, డబ్బును స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. లేదంటే స్తంభింపజేసే ఛాన్స్ ఉంది. ఈ ముఠాలపై చర్యలు తీసుకోవడానికి చట్టబద్ధ సంస్థలకు అధికారం లభిస్తుంది. కెనడా. విదేశాల్లో ఎవరైనా ఉగ్రవాద సంస్థ ఆస్తులతో సంబంధం కలిగి ఉండడం చట్టవిరుద్ధం. కెనడాలోకి ప్రవేశం కల్పించేందుకు.. లేదంటే తిరస్కరించేందుకు ఇమ్మిగ్రేషన్, సరిహద్దు అధికారులు



కూడా ఈ జాబితాను ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. కెనడియన్ ప్రభుత్వం ప్రకారం.. బిష్ణోయ్ గ్యాంగ్ చాలా ప్రాంతాల్లో చురుగ్గా ఉంది. హత్య, కాల్పులకు గ్యాంగ్ పాల్పడుతున్నది. దోపిడీ, బెదిరింపులతో భయానక పరిస్థితులు సృష్టిస్తున్నట్లుగా ప్రభుత్వం పేర్కొంది. ప్రముఖులు, వ్యాపారులతో పాటు పలువురిని లక్ష్యంగా చేసుకొని ఆయా సమాజాల్లో అభద్రతా వాతావరణాన్ని సృష్టిస్తున్నట్లు ఆరోపించింది. బిష్నోయ్ ముఠాను ఉగ్రవాద జాబితాలో చేర్చడం వల్ల కెనడియన్ భద్రత, నిఘా, ఆయా విభాగాలు నేరాలను ఎదుర్కొనేందుకు అవకాశంతో పాటు భద్రతంగా ఉంటారని తెలిపింది.


# స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పరాభవం తప్పదు

(మొదటి తరువాయి)

రాష్ట్రంలో ఉన్న వాతావరణం చూస్తే.. గల్లీ ఎన్నికైనా, ఢిల్లీ ఎన్నికైనా బీఆర్ఎస్‌కు అనుకూలమే అన్న పరిస్థితి కనిపిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రజలకు తామిచ్చిన ఎన్నికల హామీలను మర్చిపోయారని కాంగ్రెస్ పార్టీ ఆడుకుంటుందని మండిపడ్డారు. ఆరు 'గ్యారెంటీల' పేరుతో కాంగ్రెస్ చేసిన గారడీని ప్రజలు ఇంకా మర్చిపోలేదని స్పష్టంచేశారు. సమాజంలోని రైతులు, మహిళలు, ఆటో డ్రైవర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, యువత, విద్యార్థులు, వివిధ సామాజిక వర్గాల వారు అందరికీ హామీలు ఇచ్చి, కాంగ్రెస్ ఘోరంగా మోసం చేసింది' అని కేటీఆర్ ఆరోపించారు. 'కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గ్యారెంటీ కార్డులతో చేసిన గారడీలను గుర్తుచేసేందుకు మేం 'బాకీ కార్డులను' తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి తీసుకుపోతే, అదే కాంగ్రెస్ పాలిట బ్రహ్మాస్త్రం అవుతుందన్నారు. హైదరాబాద్ నగరంలో ఒక్కటంటే ఒక్క ఫ్లైఓవర్ కూడా కట్టలేదని పేర్కొన్నారు. గత 22 నెలలుగా హైదరాబాద్ నగరంలో ఉన్న రోడ్లను కూడా ప్రభుత్వం నిర్వహించలేకపోతున్నది' అని మండిపడ్డారు. హైదరాబాద్ నగరానికి మన హయాంలో చేసిన అభివృద్ధిని చూసి, మరోసారి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మనకు ఓటువేసి గెలిపిస్తారన్న నమ్మకం ఉన్నది. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ సునామీలా విస్తరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన అభయహస్తం భస్మాసుర హస్తమని తేలిపోయిందని తెలిపారు. ఆ మేరకు ప్రజల నుంచి స్పందన వస్తుంది. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చుకోవాలన్న స్పష్టమైన ఆలోచన ప్రజల్లో కనిపిస్తున్నది. ఇది రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ప్రజల్లో ఉన్నది. కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టి, తిరిగి ప్రజల సంక్షేమ, అభివృద్ధి పాలన కోసం కేసీఆర్ సారథ్యంలో ప్రభుత్వం రావాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నదని స్పష్టమవుతోంది' అని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఎరువుల కోసం లైన్లలో నిలబడి కొట్లాడే పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు గ్రామాల్లో ఆగ్రహావేశాలతో ఉన్నారు. మహిళలకు ఇస్తామని చెప్పిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ చేసిన మోసంపై ఆగ్రహం వ్యక్తమవుతుందని వివరించారు. నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇస్తామని చెప్పి వృద్ధులను మోసం చేసిందన్నారు. యువతకు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యార్థులు, విద్యార్థినులకు స్కూటీలు అని చెప్పి మాటతప్పారా లేదా అని ప్రశ్నించారు?. తెలంగాణలో పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేలు వాయించిన నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నడు' అని విమర్శించారు.

# ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలోని తూచా తప్పకుండా పాటించాలి.




**- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని**

**స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి, సెప్టెంబర్ 29:** ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలోని తూచా తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు .సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు . సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డిసిపి కరుణాకర్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఎంపిటిసి, జడ్పిటిసి , గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణ రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని అన్నారు. 2 విడతలలో స్థానిక సంస్థల,2 విడుతలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాలలో అమలు లోకి రావడం జరుగుతుందని అన్నారు. ఎం.సి.సి నిబంధనల ప్రకారం 24 గంటలు, 48 గంటలు, 72 గంటల లోపు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టే రిపోర్ట్ అందించాలని అన్నారు.బ్యాలెట్ బాక్స్ పోలింగ్ పర్సనల్ ట్రైనింగ్స్ సరిపోయేంత మెటీరియల్ అన్ని సరిగా చూసుకోవాలని తెలిపి ఉన్నారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్,డి.పి.ఓ.వీర బుచ్చయ్య, ఆర్డీవో పెద్దపల్లి గంగయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**- అధికార ప్రతినిధి బి.సుదర్శనం**



**అక్షర వేదం:సెప్టెంబర్ 29,రామగిరి** సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ ఐఆర్ఎస్,ఆదేశాల మేరకు హైదరాబాద్ కు చెందిన ఒమేగా హాస్పిటల్ ఆధ్వర్యంలో సింగరేణి ఏరియా హాస్పిటల్ గోదావరిఖని నందు అక్టోబర్-5 (ఆదివారం) రోజున సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని,రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు,సిపిఆర్ఎంఎస్ మెడికల్ కార్డు ఉన్న మాజీ ఉద్యోగులకు,ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికార ప్రతినిధి బి.సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రధానమైన,అత్యున్నతమైన వైద్య బృందం కార్డియాలజిస్ట్,న్యూరాలజిస్ట్, నెఫ్రాలాజిస్ట్,యూరోలాజిస్ట్ డాక్టర్ లు హాజరవుతున్నారని,సెప్టెంబర్ - 29 తేది నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయని,రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు మాత్రమే సూపర్ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరానికి అనుమతించబడతారని, అధికారులకు ఉచిత వైద్య శిబిరం రోజు మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు ఓ.పి.చూడబనునని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజావాణిలో సమస్యలు ఫుల్.. కానీ పరిష్కారాలు నిల్... కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన

**- ప్రజా సంఘాల నాయకులు అఖిలపక్ష ఐక్యవేదిక డిమాండ్.**



**అక్షర వేదం/ వనపర్తి:** సోమవారం ప్రజావాణిలో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులతో కలిసి వినతి పత్రం ఇచ్చిన తరువాత ఐక్యవేదిక అధ్యక్షులు డా" సతీష్ యాదవ్, బీ.ఎస్పీ నాయకులు గణపురం కృష్ణ, ప్రజా సంఘాల నాయకులు జి.టి శ్యామ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో సమస్యలతో ప్రజలు అధిక సంఖ్యలో వస్తున్నారని కానీ సమస్యలు తిరడం లేదని అవి బుట్ట దాఖలు అవుతున్నాయని, కనుక దానికి పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి ని నెలకు లేదా రెండు నెలలకు రివ్యూ మీటింగ్ పెట్టి దానిలో సరైనవి తప్పు అయినవి తెలుపాలని, అలాగే పరిష్కారాలు చూపాలని, అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. అలాగే జిల్లా ఆస్పత్రిలో జరిగిన అవినీతి కి సంబంధించిన బాధ్యులను అందరినీ శిక్షించాలని, కార్మికుల జీతాల పేరిట దోచిన సొమ్మును రికవరీ చేయాలని ఈ సందర్భంగా సతీష్ యాదవ్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, గౌని కాడి యాదయ్య, గంధం భరత్, రామస్వామి, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను కలిసిన నూతనంగా గ్రూప్ 1 ఉద్యోగి



**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి, సెప్టెంబర్ 29:** సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను ఇటీవల నియమితులైన గ్రూప్ 1 ఉద్యోగి బనావత్ వనజ మర్యాదపూర్వకంగా కలిశారు.సెప్టెంబర్ 25న విడుదలైన గ్రూప్ 1ఫలితాలలో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బి. వనజకు 504.5 మార్కులు, 38వ ర్యాంక్ రావడంతో డిప్యూటీ కలెక్టర్ గా ఎంపిక చేయబడి పెద్దపల్లి జిల్లాకు శిక్షణ కోసం కేటాయించడం జరిగింది.సెప్టెంబర్ 27న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అపాయింట్మెంట్ ఆర్డర్స్ తీసుకున్న తర్వాత సోమవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ గా విధులలో చేరారు.

## డీఎస్పీగా సింగరేణి కార్మికుని కూతురు సృజన



**అక్షర వేదం: సెప్టెంబర్ 29,రామగిరి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాలలో సింగరేణి కార్మికుని కూతురు డీఎస్పీగా పోస్టు సాధించింది.టీఎస్పిఎస్సీ గ్రూప్ 1 పరీక్ష ఫలితాలలో 35వ ర్యాంకు సాధించిన రామగిరి మండలం పన్నూరు గ్రామానికి చెందిన సింగరేణి కార్మికుడు గుడెల్లి రాజేశం - రాణి కూతురు గుడెల్లి సృజన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డిఎస్పీగా నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా సృజన డీఎస్పీగా ఎంపిక అవ్వడం పట్ల మాజీ జెడ్పిటిసి మేదరవేన శారద కుమార్ యాదవ్,మాజీ ఉపసర్పంచ్ దామర శ్రీనివాస్,చిందం రమేష్,విజ్జగిరి భూమన్న,చేలుకల జోహార్ తో పాటు పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## రాజీవ్ గృహ కల్పన ప్రజల సమస్య లపై అధికారులు దృష్టి సాగించాలి.

**- స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్**



**అక్షర వేదం/ వనపర్తి :** వనపర్తి పట్టణం లో 30 వ వార్డు రాజీవ్ గృహ కల్పన నివాసం లో 40 పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.వారికి త్రాగడానికి మంచి నీరు సమయానికి రావడం లేదు.పరిశుభ్రత మరియు సమస్య లపై పర్యవేక్షణ లేదు.అధికారులు వస్తారు సమస్య వింటారు చేస్తామని హామీ ఇచ్చి మళ్ళీ కనబడరు.కనీసం చెత్త సేకరణ వాహనం కూడా రావడం లేదు.డ్రైనేజ్ కాలువలు ముందు భాగాన తీసి ఇప్పుడు తీయడం లేదు.పరిశుభ్రత లోపం వల్ల దోమల వల్ల డెంగ్యూ, మలేరియా జ్వరాల వల్ల హాస్పిటలలో చికిత్స తీసుకుంటున్నామని తెలిపారు.ఈ సందర్భంగా దయానంద్ ముదిరాజ్ మున్సిపాలిటీ కమిషనర్ కి చరవాణి సమాచారం అందజేశారు.సమస్య లపై అధికారులు దృష్టి సాగించి ప్రభుత్వం ప్రజా ప్రతినిధుల దృష్టి కి తీసుకెళ్ళిన భాధ్యత అధికారులది తెలిపారు.

ప్రధానం గా వాటర్ ట్యాంక్, దోమల ఫాగింగ్ చుట్టు పరిసరాల శుభ్రత చెత్తకుండి ల ఏర్పాటు చేసి కమిటీ సభ్యులను ఏర్పాటు చెయ్యాలనీ కోరారు.

## దుర్గాదేవి ఉత్సవాలకు రూ. 20వేల విరాళం ఇచ్చిన మాజీ సర్పంచ్



**అక్షర వేదం సెప్టెంబర్ 29 రామగిరి** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో దుర్గాదేవి ఉత్సవాలకు రూ. 5016/-ల నగదు, రూ.15 వేల విలువ చేసే అమ్మవారికి ముక్కు పూడుక విరాళముగా తాజా మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు అందించారు. సోమవారం గ్రామంలోని దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల పూజలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్వతి రూపంలో కొలువైన దుర్గాదేవి కి పూజలు చేశారు. గ్రామ పూజారి సౌమిత్రి కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఓసీపీ-1 భద్రకాళి దేవాలయంలో రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె. ప్రతిమ పీవీరావు పూజలలో పాల్గొన్నారు. పూజారి సముద్రాల విజయ సారధి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాన్ని చల్లగా చూడాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపరవైజర్ కొప్పుల అనిత-రవీందర్ రావు, ఉపాధి ఏ.పి.ఓ పల్లె.మంజుల,స్థానిక నాయకులు ఉడుత శంకర్ జక్కుల చందన్ కుమార్ పబ్బ వెంకటేష్ జక్కుల మహేష్ నగునూరి సతీష్ ముక్కెర మోహన్ కెక్కర్లమోహన్ సందవేనా కుమార్ ధర్మల వర్షిత్ ముక్కెర వినయ్ కెక్కర్ల అరవింద్ చిలకల ఆదిత్య బైన ఓదెలు మైలారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థిని సన్మానించిన మాజీ మంత్రి



**అక్షర వేదం/వనపర్తి :** వనపర్తి పట్టణం టీచర్స్ కాలనికి చెందిన సుగుర్ సురేందర్ మేస్త్రి మనుమరాలు శ్రీ లక్ష్మి ఎంబిబిఎస్ సీటు సాధించారు. ఈ సందర్భంగామాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి నివాసంలో శాలువాతో సన్మానించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని అభినందించారు.ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్,, నందిమల్ల అశోక్, కంచ రవి, సూర్యవంశం గిరి, జోహేబ్ హుస్సేన్, చిట్యాల రాము, రామకృష్ణ, ఆరిఫ్, మంద రాము, అనపటి రాము, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షలలో ప్రతిభ చాటిన విద్యార్థికి సన్మానం చేసిన మాజీ మంత్రి



**అక్షర వేదం /వనపర్తి:** పట్టణంలోని 6వ వార్డుకు చెందిన సదుర్ల. బాలమణి రామస్వామి కుమారుడు సదుర్ల.నవీన్ ఇటీవల జరిగిన గ్రూప్2 పరీక్షలో 627వ ర్యాంక్ సాధించి ఫైనాన్స్ డిపార్ట్మెంట్ లో ఏ ఎస్ ఓ గా ఉద్యోగాన్ని సాధించడంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి స్వగృహంలో నవీన్ ను ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమములో గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ నందిమల్ల అశోక్, కంచ.రవి,రవిప్రకాష్ రెడ్డి మోహన్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్ పూర్ గ్రామ సర్పంచ్ బరిలో కొప్పుల రాఘవ పటేల్



**అక్షర వేదం/మంథని,సెప్టెంబర్ 29:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా గోపాల్ పూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికకు బీసీ సామాజిక వర్గానికి అవకాశం లభించింది.కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గోపాల్ పూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుదిల్ల శ్రీను బాబు ఆశీర్వాదంతో పోటీ చేయటానికి అవకాశం కల్పిస్తే సర్పంచ్ బరిలో నిలుస్తానని మంథని మండలం గోపాల్ పూర్ గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు కొప్పుల రాఘవ పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు.గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా,యూత్ కాంగ్రెస్ నాయకుడిగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పార్టీలో పని చేస్తూ వచ్చానన్నారు.కాంగ్రెస్ పార్టీ అవకాశమిస్తే గోపాల్ పూర్ గ్రామ సర్పంచ్ పదవికి బరిలో నిలిచి గ్రామ ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు..

# ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం**



**అక్షర వేదం ప్రతినిధి: పెద్దపల్లి, సెప్టెంబర్ 29:**
ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్య ఆరోగ్యశాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయశ్రీహర్షమాట్లాడుతూ, ఆశా కార్యకర్తల ద్వారా ప్రసవానికి దగ్గర గా ఉన్న గర్భిణీ మహిళలను ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రెగ్నెన్సీ గుర్తింపు నుంచి ప్రసూతి వరకు అన్ని దశలలో ప్రభుత్వ వైద్య సహాయం పొందాలని, ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్, టీకాలు 100% జరిగేలా చూడాలని అన్నారు.ఆర్.బి.ఎస్.కే బృందాల పనితీరును పర్యవేక్షించాలని , పాఠశాలలను నిరంతరం తనిఖీ చేస్తూ పిల్లల ఆరోగ్య స్థితి గతులను రెగ్యులర్ గా చెక్ చేయాలని, అవసరమైన వారికి వైద్య చికిత్సలు అందజేయాలని అన్నారు.ఎన్.సి.డీ స్క్రీనింగ్ ప్రతి హెల్త్ సెంటర్ పరిధిలో పక్కాగా జరగాలని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు టీవీ అనుమానితులను గుర్తించి నిర్ధారణ పరీక్షలు చేయాలని అన్నారు. సబ్ సెంటర్ నిర్మాణ మరమ్మత్తు పనులు సకాలంలో పూర్తి కావాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణి శ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎం పీ గడ్డం వంశీ కృషితో రామగిరి ఖిల్లాకు రోప్‌వే ఆమోదం

**- రామగిరి పర్యాటక అభివృద్ధికి అదనంగా రూ,2.5 కోట్లు**



**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి సెప్టెంబర్ 29:**
రామగిరి ఖిల్లా పర్యాటకాభివృద్ధి కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రోప్‌వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టు సాధనలో పలు స్థాయిల్లో నిరంతర కృషి చేసి, ప్రతిపాదనలు సమర్పించిన పెద్దపల్లి ఎంపీ శ్రీ వంశీ గడ్డం ప్రధాన పాత్ర పోషించారు. 2.46 కోట్లు వ్యయంతో 2.1 కిలోమీటర్ల పొడవైన రోప్‌వే నిర్మాణం చేపడతారు. దీని ద్వారా కోట పాదాల నుండి కొండపై భాగానికి భక్తులు, పర్యాటకులు సులభంగా, సురక్షితంగా చేరుకోగలరు. అదనంగా, రామగిరి పరిసరాల్లో పర్యాటక అభివృద్ధికి మరో 2.5 కోట్లు కేటాయించబడ్డాయి.ఈ సందర్భంగా ఎంపీ వంశీ గడ్డం మాట్లాడుతూ:"ఇది చాలా కాలంగా సాగుతున్న పోరాటం. రామగిరి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వివరిస్తూ మౌలిక సదుపాయాల అవసరాన్ని పదేపదే ప్రతిపాదించాను. ఇప్పుడు ఆ కృషి ఫలించింది. రోప్‌వే వల్ల భక్తులు, పర్యాటకులకు సౌలభ్యం కలుగుతుంది. అదనంగా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు, చిన్న వ్యాపారాలకు ఆదాయం వస్తుంది. రామగిరి అభివృద్ధి దిశగా ఇది ఒక కొత్త అధ్యాయం." అని అన్నారు.ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే రామగిరి ఖిల్లా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందటమే కాకుండా, ప్రముఖ పర్యాటక కేంద్రంగా వెలుగొందనుంది.

# కార్మిక క్షేత్రాలలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు





**అక్షర వేదం:సెప్టెంబర్ 29,రామగిరి**
తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వైభవానికి, ఆత్మ గౌరవానికి ప్రతీకైన పూల పండగ సద్దుల బతుకమ్మ వేడుకలు రామగిరి మండలం సెంటినరీ కాలనీ కార్మిక క్షేత్రాలతో పాటు గ్రామ గ్రామాన సోమవారం ఘనంగా జరిగాయి.ప్రజల బతుకుల్లో వెలుగులు నింపాలని, మరింత సుఖ సంతోషాలతో జీవించేలా దీవించాలని గౌరీ మాతను తొమ్మిది రోజులపాటు ఆరాధిస్తూ ఉయ్యాల పాటలతో సాగే బతుకమ్మ పండుగ లో మహిళలు,పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.తంగేడు,గునుగు తో పాటు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఒక చోట చేర్చి ఉయ్యాల పాటలతో మహిళలు ఆడి పాడారు. ఈ కార్యక్రమంలో మౌనిక,కరుణ, రమాదేవి, అనురాధ, శ్యామల, భాగ్య, అమూల్య, రమ్య, పూజ, విజయలక్ష్మి, వినోద అనూష,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# నానో యూరియా పై రైతులకు అవగాహన

**- సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి**




**అక్షర వేదం మల్దకల్ ప్రతినిధి సెప్టెంబర్ 29**
మల్దకల్ మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో సోమవారం నానో యూరియా పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు సింగల్ విండో అధ్యక్షుడు శేషంపల్లి తిమ్మారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సింగల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధి పథంలో నడవాలంటే రైతులు ఎల్ టి, క్రాప్ లోన్లు రెగ్యులర్గా కట్టి ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకోవాలని ఆయన సూచించారు.సహకార సంఘంప్రతి సంవత్సరం వరి,కందులు మొక్కజొన్న,తదితర పంటలు కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులందరూ సకాలంలో అందుబాటులో ఉన్న కేంద్రాలకు తీసుకొచ్చి అమ్మకాలు చేసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీపై యూరియా, జిలుగా,విత్తనాలు ఇవ్వడంతోపాటు రైతులకు వ్యవసాయ పనిముట్లు కూడా అందజేయడం జరుగుతుంది. ఇప్పుడిప్పుడే సంఘం లాభాల బాటలో నడుస్తుందని ప్రస్తుతం సంఘము అభివృద్ధికి రైతులందరూ సహకారం తోడ్పాటు అందించాలన్నారు. నానో యూరియా రైతులకు యాసంగి సీజన్లో కూడా అందజేస్తామని ఎవరు కూడా ఎలాంటి అపోహాలు గురి కావద్దని తమకు కావలసిన ఎరువులు మాత్రమే తీసుకొని వాడుకోవాలన్నారు.నానో యూరియా వాడడం వల్ల పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని రైతులు దృష్టి సారించి వాడాలన్నారు. కొంతమంది రైతులు యూరియా తీసుకొని ఇంటి దగ్గర స్టాక్ పెట్టుకొని ఉంచుతున్నారని ఆయన తెలిపారు.10 కోట్లు రూపాయలు 15 మందికిరైతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఏవో రాజశేఖర్,సింగల్ విండో సీఈవో కిరణ్ కుమార్ రెడ్డి, డైరెక్టర్లు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలు



**అక్షర వేదం:సెప్టెంబర్ 29,రామగిరి**
సింగరేణి రామగుండం-3 & అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం నందు సద్దుల బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, గౌరవ అతిథులుగా రామగుండం-3 ఏరియా సేవా అధ్యక్షురాలు ఎన్.అలివేణి సుధాకర రావు, ఏ.పీ.ఏ జి.ఎం సతీమణి కె.వెంకటలక్ష్మీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక అని,పూలను దేవతలుగా పూజిస్తూ,ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలందరూ ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండుగ అన్నారు.తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగ గొప్పతనాన్ని రాబోయే తరాలకు కూడా తెలియజేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.బతుకమ్మ పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందని,ప్రతి దేవుడికి పూలతో పూజిస్తామని,కానీ అవే పూలతో కూడిన,వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మ ను దేవత లా పూజించడం ఈ పండగ గొప్పతనమని అన్నారు.అందరికి సద్దుల బతుకమ్మ,దసరా శుభకాంక్షలు తెలిపారు. అనంతరం ఉత్తమ బతుకమ్మలుగా ఎంపికైన ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతుల తో పాటు 10 కన్సులేషన్ బతుకమ్మల వారికి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు,ఎం.రామచంద్ర రెడ్డి,కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు సి.హెచ్.వెంకటరమణ ఇంచార్జ్ ఎస్వోటుజిఎంలు బండి సత్య నారాయణ,బి.వి.సత్య నారాయణ, సివిల్ డిజిఎం రాజేంద్ర కుమార్,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం,సేవా కార్యదర్శి ఉమాదేవి,సంయుక్త కార్యదర్శి బి.అరుణ లతో పాటు ఇతర అధికారులు,కార్మిక సంఘాల నాయకులు,ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలు,సేవా సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంథని పట్టణంలో ఘనంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం





**అక్షర వేదం/మంథనిసెప్టెంబర్ 29:**
దుర్గాదేవి శరన్ నవరాత్రుల్లో భాగంగా మంథని పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా సోమవారం రోజున ఘనంగా ఊరేగించారు.వాడవాడల్లో ఉట్టి కట్టి గోపాల కాలువలు కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. తమ్మిచెరువు కట్ట ప్రముఖ క్రికెట్ కామెంటర్లు మహావాది సుధీర్,విజయ్ లు భక్తి పాటలతో డ్యాన్స్ చేస్తూ అందరిని అలరించారు.నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు నిరంతరం భజన కార్యక్రమం నిర్వహించడం ఈ ఆలయం యొక్క ఆనవాయితీగా చెప్పుకోవచ్చు.చక్రిభజన కార్యక్రమంలో అన్ని వాడలకు చెందిన భజన పరులు రాత్రి 8 గంటల నుండి 11 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.మంథని పట్టణంలోని అన్ని వాడలకు చెందిన భజన బృందాలు పాలీల వాయిదా కార్యక్రమంలో పాల్గొన్నారు. తొమ్మిది రోజులపాటు తాళం,గానం ఆపకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఒక సంప్రదాయం.ప్రతి భజన మండలికి రోజు రెండు గంటలు చొప్పున ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాదిమంది భక్తులు తరలి వస్తారు.ఎంతో విశిష్టత కలిగిన మహాలక్ష్మీ అమ్మవారు భక్తుల పాలిట కొంగు బంగారంగా భక్తుల్లో ఎంతో విశ్వాసం నెలకొంది. నియమ, నిష్టలతో అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పిస్తే అంతా శుభం జరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.చివరి రోజున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల గుండా భక్తులు ఆటపాటలతో నిత్యాలతో కోలాటాలతో ఊరేగిస్తారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు..

# నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**- రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష**



**అక్షర వేదం ప్రతినిధి:పెద్దపల్లి, సెప్టెంబర్-29:-**
భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో కలెక్టర్ రెవెన్యూ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారం, భూ భారతి దరఖాస్తులు, ప్రజావాణి దరఖాస్తులు, మీ సేవా దరఖాస్తులు, పెండింగ్ భూ సేకరణ తదితర అంశాల పై కలెక్టర్ మండలాల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల అర్హత ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.భూ భారతి పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణిత గడువు లోగా పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్ , తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనాడు' సహాయనిధితో పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన మహబూబాబాద్ శాసనసభ్యులు డా భూక్యా మురళీ నాయక్

**అక్షర వేదం /నెల్లికుదురు మండలం,రావిరాల గ్రామం :-సెప్టెంబర్ 29.**
మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. 'ఈనాడు' రిలీఫ్ ఫండ్ ద్వారా నిర్మాణ పనులు చేపట్టనున్నారు. గతేడాది సెప్టెంబర్ 1న కురిసిన భారీ వర్షానికి ఈ పాఠశాల భవనం దెబ్బతింది. సుమారు రూ.కోటి వ్యయంతో నూతన భవన నిర్మాణం చేపట్టాలని 'ఈనాడు' సంకల్పించింది. తాజాగా పనులు ప్రారంభించేందుకు భూమి పూజ నిర్వహించింది. ముఖ్య అతిథిగా మహబూబాబాద్ ఎమ్మెల్యే డా భూక్యా మురళీ నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలు చేపడుతున్న 'ఈనాడు' సంస్థను అభినందించారు.పత్రికాపరంగా సమాజం పట్ల బాధ్యతను నిర్వర్తించడంలో, సామాజిక కార్యక్రమాల నిర్వహణలోనూ ముందుంటోందని కొనియాడారు.జూలై 30 తారీఖు నాడు ఎప్పుడైతే మేము గ్రామాన్ని సందర్శించాము. వాస్తవానికి ఒక స్మశాన వేదికల రావిరాల గ్రామం ఆరోజు అప్పుడు పడంత వర్షం వాస్తవానికి మన మహబూబాబాద్ జిల్లాలో ఎక్కడ ఎప్పుడు పడలేదు అందుకే అప్పుడు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 2వ తారీఖు




నాడు వాతావరణం అనుకూలించకపోయినా వారు బై రోడ్డు మహబూబాబాద్ జిల్లాకు వచ్చి రివ్యూ తీసుకొని అధికారులు అప్రమత్తం చేసి ఆరోజు మనకి ఇక్కడ పునరావాస కార్యక్రమాలు ముమ్మరంగా సాగాలని చెప్పేసి వారు ఆరోజు ఇక్కడికి రావడం జరిగింది . రావిరాల గ్రామస్తుల అందరి తరపున ఈనాడు టీంకి వారికందరికీ హార్దిక శుభాకాంక్షలు అదేవిధంగా ధన్యవాదాలు తెలియజేశారు .నేను గతంలోనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అదేవిధంగా రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు కూడా ఇక్కడ కనీసం ఒక 100 ఇందిరమ్మ ఇవ్వండి అని కోరడం జరిగింది. అందుకే వారు కూడా సానుకూలంగా స్పందించి మనకు రాబోయే రోజుల్లో ఇంకొక మనకు విడతల వారికి కాకుండా అధికంగా ఇంకొక 100 ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ఇవ్వడం జరిగింది. తప్పక మనం అధికంగా ఇంకొక ఇందిరమ్మ ఇల్లు 100 ఇందిరమ్మ ఇల్లు ఇక్కడ తీసుకొద్దాం. ప్రతి పేదోడికి ఎవరెవరు గుడిసెలు కూలిపోయినవ్ వాళ్ళ ఇల్లు దీనా స్థితిలో ఉందో ఆ ఇళ్లను మనం నిర్మించుకుందాం.మీ గ్రామాలను ఎంపీటీసీలను సర్పంచ్లను వార్డ్ మెంబర్ని అదేవిధంగా జెడ్పిటిసిలను గెలిపించే బాధ్యత ఉంది ఎందుకంటే మీరు మాకు భరోసా ఇస్తేనే ఇంకా అతి ఉత్సాహంతోటి మీకున్నటువంటి కష్టాలు నష్టాలు మేము పాలుపంచుకుంటాం, ప్రతి ఒక్క కార్యక్రమంలో పాల్గొంటానని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ అనిల్ కుమార్, డీఈవో దక్షిణామూర్తి, టీజీ ఈడబ్ల్యూఐడీసీ డీఈ అరుణ్ కుమార్, మండల ప్రత్యేక అధికారి మరియన్న పాల్గొన్నారు. 'ఈనాడు' సంస్థ. తరపున సర్క్యులేషన్ విభాగం జి.ఎం. సుధాకర్, వరంగల్ యూని మేనేజర్ దామోదర్ రెడ్డి, జిల్లా నాయకులు, మండల నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెస్ విజేతలకు బహుమతులు అందజేత



**అక్షర వేదం/మహాముత్తారం, సెప్టెంబర్29 :**
మహాముత్తారం మండల కేంద్రంలో మండల స్థాయి చెస్ క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించి బహుమతుల ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రఫీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ యండి రఫీ హాజరయ్యారు. అనంతరం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆయన చేతుల మీదుగా బహుమతులు ప్రధానోత్సవం చేశారు. మొదటి బహుమతి గంట మహేష్, రెండవ బహుమతి జనగాం రవి, మూడో బహుమతి రేణికుంట్ల వినోద్ కుమార్, నాలుగవ బహుమతి తలారి బాపు లు కైవాసం చేసుకున్నారు. అనంతరం డాక్టర్ రఫీ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకొని ఉద్యోగస్తులుగా స్థిరపడి తల్లిదండ్రులకు తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆదేశిస్తే పోటీ చేస్తా..



**అక్షర వేదం /మహాముత్తారం, సెప్టెంబర్29 :**
రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ప్రకటించగా మహాముత్తారం గ్రామపంచాయతీకీ ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వేషన్ కల్పించింది. అందులో భాగంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహాముత్తారం గ్రామపంచాయతీ సర్పంచ్ గా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పోటీ చేయడానికి అవకాశం కల్పిస్తే బరిలో నిలుస్తానని మండల కేంద్రానికి చెందిన మాడెం ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నానని తెలిపారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నేతకాని సామాజిక వర్గానికి చెందిన తనకు మహాముత్తారం గ్రామపంచాయతీ సర్పంచ్ గా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని కోరాడు. ఒక్క అవకాశం కల్పిస్తే ప్రజా ఆశీర్వాదంతో గెలిచి మళ్ళీ ప్రజలకే సేవకుడను అవుతానని ధీమ వ్యక్తం చేశాడు.

# 8వ రోజున సరస్వతి దేవిగా అమ్మవారి దర్శనం.



**అక్షర వేదం ప్రతినిధి: కమాన్ పూర్ సెప్టెంబర్ 29:**
మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణం ముందు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వాహకులు ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో సోమవారం రోజున జ్ఞానసరస్వతి దేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8 వ రోజున అమ్మవారిని జ్ఞాన సరస్వతి దేవిగా అలంకరించి, వేద పండితులైన గడియారం సత్యనారాయణ శర్మ , మంత్రోచ్చానలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేకమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అనంతరం తీర్థ ప్రసాదలు స్వీకరించారు.


# బతుకమ్మ సందర్భంగా చీరల పంపిణీ

## - దసరా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన ఆగిడి లింగయ్య (శివ)



**అక్షర వేదం,జైపూర్, సెప్టెంబర్ 29**
మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం నర్వ గ్రామంలో బతుకమ్మ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుమారుగా 400 చీరలు ఆడపడుచులకు పంపిణీ చేశారు,సోమవారం జైపూర్ మండలంలోని నర్వ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆగిడి లింగన్న (శివ) తన సొంత ఖర్చులతో చీరలు పంపిణీ చేసి అక్కడున్న యువకులతో సమావేశం అయ్యారు,చీరలు పంపిణీ తో పాటు ప్రతి సమస్యలో ప్రజలకు తోడు ఉండి ఆదుకుంటానని తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముందుగా ఆడపడుచులకు మహిళలకు దసరా సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు అని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో గొప్ప పండగ అయిన సద్దుల బతుకమ్మ ను అందరూ అంగరంగ వైభవంగా జరుపుకోవాలని అన్నారు.ఈ దసరా పండుగను ప్రతి ఒక్కరూ వారి కుటుంబ సభ్యులతో ఘనంగా జరుపుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జైపూర్ ఎన్ టి పి సి లో ప్రమాదవశాత్తు సిఐఎస్ఎఫ్ ఏఎస్ఐ మృతి



**అక్షర వేదం,జైపూర్, సెప్టెంబర్ 29**
మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టిపిపి)లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీ ఐ ఎస్ ఫ్)కు చెందిన అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఏ ఎస్ ఐ నరహరి అర్జున సారథి (56) దుర్మరణం పాలయ్యారు.వివరాల్లోకి వెళితే ఆదివారం రాత్రి విధుల్లో ఉన్న అర్జునసారథి, ఎస్టిపిపి పరిపాలన భవనం ఎదురుగా ఉన్న గేటును ఎత్తే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో గేటు అదుపు తప్పి ఆయన మీదకు పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. తోటి సిబ్బంది వెంటనే స్పందించి గేటును పక్కకు జరిపి గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా, కొచ్చర్ల గ్రామానికి చెందినవారని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు జైపూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీధర్ వెల్లడించారు.సంఘటనతో ఎస్టిపిపి పరిసరాల్లో విషాద వాతావరణం నెలకొంది. సహచరులు, అధికారులు అర్జునసారథి మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.

# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబురాలు




**అక్షరవేదంప్రతినిధి: కమాన్ పూర్ సెప్టెంబర్ 29:**
తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి, పూలను దేవతలుగా పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలు అందరు ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులు పాటు జరుపుకునే ఈ పండుగ గొప్పతనాన్ని రాబోయే తరాలకు కూడా తెలియజేయవలసిన బాధ్యత మనందరి మీద ఉంది. ప్రతి దేవుడికి పూలతో పూజిస్తాం వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మ దేవతల పూజించడం పండగ గొప్పతనం. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా వందలాది మహిళలు ఒకచోటకు చేరి ఆడుతూ పాడుతూ సంబరాలు చేసుకుంటున్నారు తీరోక్కపూలతో బతుకమ్మను భక్తిశ్రద్ధలతో పేర్చారు. వరుణుడు కరుణించడంతో సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సహాలతో జరుపుకున్నారు.

# దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



**అక్షర వేదం/వనపర్తి: శరన్నవరాత్రుల్లో**
భాగంగా పెబ్బేరు మండలం వై శాఖ పురం గ్రామంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భక్తులకు కార్యకర్తలు పాల్గొన్నారు.

# (మాజీ గ్రంథాలయం సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు సార్ స్వగృహం) నందు..



**అక్షర వేదం /బీచరాజిపల్లి మరిపెడ మండలం:-సెప్టెంబర్ 29.**
డిఎస్పీ గా ఎన్నికైన, మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని 15వ వార్డు ఆర్లగడ్డ తండా కు చెందిన.. బాలాజీ నాయక్ పెద్ద కుమారుడు విజయ్ నీ శాలువా తో సన్మానించిన.మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ గుడిపూడి నవీన్ రావు - మంజులమ్మ దంపతులు..

# అనఘాపురి కాలని లో ఘనంగా సద్దుల బతుకమ్మ

## పాల్గొన్న బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్





**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/వేంఢి వల్లి: బోడుప్పల్,సెప్టెంబర్ 29,**
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనఘాపురి కాలని లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం నాడు అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకార పూజ కార్యక్రమం లో మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం కాలనీ మహిళలతో కలిసి సద్దుల బతుకమ్మ వేడుకలు లో పాల్గొని బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు ఆటలు ఆడారు.

# శభాష్ పోలీస్..

## ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరిన చిన్నారిని కాపాడిన పోలీసులు




**అక్షర వేదం న్యూస్ /హన్మకొండ:**
సెప్టెంబర్ 29 సోమవారం: ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరిన ఏడాది వయస్సు గల చిన్నారిని సకాలంలో ఆసుపత్రికి తరలించి పోలీసులు ఔదార్యాన్ని చాటుకున్నారు.పద్మాక్షి గుట్ట వద్ద సద్దుల బతుకమ్మ వేడుకల్లో భారీగా జన సందోహం కావడంతో ఓ చిన్నారి ఫిట్స్ వచ్చి అస్వస్థకు గురి కావడంతో అక్కడే విధుల్లో ఉన్న ఎస్సై కిషోర్, కానిస్టేబుల్ రమణాకర్ స్పందించి చిన్నారిని ప్రథమ చికిత్స చేసి తమ బైక్‌పై సమీపంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించి చిన్నారి ప్రాణం కాపాడారు. చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

# జడ్పీ పీఠంపై రెడ్ల కన్ను




**అక్షర వేదం /మహబూబాబాద్:- సెప్టెంబర్ 29.**
మహబూబాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్ జనరల్ కావడం తో ఇప్పుడు అందరి దృష్టి జడ్పీ పీఠంపైన పడింది.ఒక్కసారిగా జిల్లాలో పొలిటికల్ ఈట్ మొదలైంది.సో జనరల్ కావడం తో ఆరంభమైన పొలిటికల్ న్యూస్ ఇంకా ఎలా ఉండబోతోందో జడ్పీ పీఠం ఎవరికి దక్కేనో మరికొద్ది రోజుల్లో తెలిసిపోతుంది. అప్పటివరకు వేచి చూద్దాం! మహబూబాబాద్ జనరల్ కావడంతో పెరిగిన పొలిటికల్ హీట్ అధికార పార్టీ నుంచి రేసులో వేం నరేందర్‌రెడ్డి తనయుడులివెన్నం శ్రీకాంత్ రెడ్డి, నూకల అభినవరెడ్డి పేర్లు సైతం ప్రచారంలో!.

# తల్లి ప్రోత్సాహంతో కొడుకు డీఎస్పీ

**గ్రూప్1 సాధించడానికి కృషి,పట్టుదల ముఖ్యం**
**228 వ ర్యాంక్ సాధించిన వంగ అక్షయ్ కుమార్ రెడ్డి డీఎస్పీ గా నియామకం.**





**అక్షర వేదం/రాజన్న సిరిసిల్ల/గంభీరావుపేట:సెప్టెంబర్ 29,**
పట్టుదలతో చదివితే సాధించలేని ఏది లేదని గ్రూప్ 1 పోటీ పరీక్షలకు పోటీ పడి 228 వ ర్యాంక్ సాధించి డీఎస్పీ గా నియమితులయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా, గంభీరావు పేట మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన అక్షయ్ కుమార్ రెడ్డి కుటుంబం జగద్గిరిగుట్ట ఆల్విన్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అక్షయ్ కుమార్ రెడ్డి చిన్నతనం నుండి ఇక్కడే చదివాడు. సీఏ, ఎం.ఎ ఎకనామిక్స్ పూర్తి చేసి సివిల్స్ కి ప్రిపేర్ అయ్యాడు. సివిల్ సర్వీసెస్ కి ప్రిపేర్ అయ్యాడు. అలా అవుతూనే గ్రూప్1 రాశాడు. ఏడు సంవత్సరాల క్రితం గుండె పోటుతో తన తండ్రి మరణించాడు. అయినప్పటికీ కృంగి పోకుండా తన తల్లి రేణుక ఇచ్చిన ప్రోత్సాహంతో పట్టుదలతో చదివి గ్రూప్1 ద్వారా డీఎస్పీ ఉద్యోగం సాధించాడు. కృషి,పట్టుదలతో ప్రణాళికా బద్ధంగా చదివితే ప్రతి ఒక్కరూ అనుకున్న లక్ష్యానికి చేరుకుంటారని అక్షయ్ కుమత్ రెడ్డి చెబుతున్నాడు. తన్న తల్లి తనకోసం పడ్డ కష్టమే ఈరోజు తాను సాధించిన ఉద్యోగం అని చెబుతున్నాడు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు, బందు మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

# బూడిదపల్లిలో అంగరంగ వైభావంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు



**అక్షర వేదం:సెప్టెంబర్ 29,కాటారం**
బూడిదపల్లి SC కాలనీ 7 వార్డ్ ఆధ్వర్యంలో సోమవారం సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగినది. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పూలను దేవతలుగా పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలందరూ ఎంతో ఉత్సాహంతో జరుపుకునే పండుగ అన్నారు.తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ పండుగ గొప్పతనాన్ని రాబోయే తరాలకు కూడా తెలియజేయాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.బతుకమ్మ పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందని,ప్రతి దేవుడికి పూలతో పూజిస్తామని,కానీ అవే పూలతో కూడిన,వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మ ను దేవత లా పూజించడం ఈ పండగ గొప్పతనమని అన్నారు.అందరికి సద్దుల బతుకమ్మ,దసరా శుభకాంక్షలు తెలిపారు. అధికారులు,కార్మిక సంఘాల నాయకులు,ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



**అక్షర వేదం/మరిపెడ మండలం కేంద్రం:-సెప్టెంబర్ 29.**
మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని 3వ వార్డులో మహిళలు ఆడపాడుతూ సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ బతుకమ్మ గీతాల నడుమ రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను పేర్చుకొని మహిళలు ఆనందోత్సాహాలతో .ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ చుట్టూ నృత్యాలు చేస్తూ, పూలదండలతో అలరించారు. పండుగ వాతావరణం మరిపెడ మున్సిపల్ కేంద్రాన్ని సందడిగా మార్చింది. ఈ కార్యక్రమం లో అనంతగిరి విజయ. జమ్ముల సుస్మిత. అనంతగిరి హరిత. తిమ్మిడి మానస. గంగుల పల్లవి. గంగుల తులసి గంగుల మల్లమ్మ అనంతగిరి ప్రమీల. అనంతగిరి కీర్తన. అనంతగిరి లిప్సి.తదితరులు పాల్గొన్నారు.

# మరిపెడలో ఘనంగా సద్దుల బతుకమ్మ

**ప్రజలతో కలిసి ఉత్సవాన్ని ఆనందంగా ఆస్వాదించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ డాక్టర్ ప్రమీల దంపతులు**

**అక్షర వేదం /మరిపెడ మున్సిపల్ కేంద్రం ఎంపిడివో కార్యలయం:- సెప్టెంబర్ 29.**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో దుర్గాదేవి నవరాత్రి మహోత్సవంలో భాగంగా దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్, డాక్టర్ ప్రమీల, దంపతులు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. బతుకమ్మ చుట్టూ మహిళలు పూలబతుకమ్మను ఆడారు. పూలతో నిండిన బతుకమ్మలు ఆ ప్రాంగణాన్ని అలరించాయి. డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్



జాటోత్ రామచంద్రనాయక్, డాక్టర్ ప్రమీల, దంపతులు, ప్రజలతో కలసి బతుకమ్మ చుట్టూ ఆడుతూ సంతోషాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ , తెలంగాణ ప్రత్యేకతకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటిలోనూ, ప్రతి ఊరిలోనూ ఘనంగా జరుపుకుంటున్నారని అన్నారు. బతుకమ్మ ద్వారా మహిళల ఆరాధన, పూల పట్ల ఉన్న మమకారం, సాంప్రదాయ విలువలు ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి ,రాహుల్ గాంధీ విచార్ మంచ్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు విసారపు శ్రీపాల్ రెడ్డి,మరిపెడ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్లి రఘువీరారెడ్డి, కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద బోయిన ఐలమల్లు, జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు గుండగాని వేణు, మరిపెడ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్,జిల్లా నాయకులు షేక్ అఫ్జల్,మరిపెడ మున్సిపల్ 9వ వార్డు మాజీ కౌన్సిలర్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి, మచ్చ వెంకట నరసయ్య, నల్లు శ్రీకాంత్ రెడ్డి, కొంపల్లి సురేందర్ రెడ్డి, అల్వాల ఉపేందర్ ప్రజాపతి, కారంపూడి ఉపేందర్, బాషిపాంగు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి తనిఖీలు షురూ...

**-అమల్లోకి ఎన్నికల కోడ్..**
**-మీ వద్ద అంతకు మించి ఒక్క రూపాయి ఎక్కువ ఉన్నా సీజ్..!**



**అక్షర వేదం/మహబూబాబాద్ జిల్లా:- సెప్టెంబర్ 29.**
తెలంగాణ పల్లెల్లో ఎన్నికల జాతర ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేశారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో మొత్తం ఐదు దశల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి.నామినేషన్ల ప్రక్రియ అక్టోబర్ 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజు నుంచే ప్రారంభమవుతుంది. మ్నొత్తం ఐదు దశల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నాయి. ఈ ప్రక్రియ నవంబర్ 11తో ముగుస్తుంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచే ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉండనుంది.
ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ఆంక్షలు ఉంటాయి. ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు రవాణా అరికట్టేందుకు అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తారు. నేటి నుంచి ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఒక సామాన్య వ్యక్తి రూ. 50 వేల వరకు మాత్రమే నగదు తీసుకెళ్లడానికి అనుమతి ఉంటుంది. ఎన్నికల కమిషన్ సూచించిన దానికంటే ఒక్క రూపాయి ఎక్కువ ఉన్నా, సరైన పత్రాలు లేకపోతే ఆ నగదును అధికారులు సీజ్ చేస్తారు.ఎక్కువ మొత్తంలో నగదు దొరికితే.. ఎన్నికల అధికారులు ఐటీ (IT), జీఎస్టీ అధికారులకు సమాచారం అందించి ఆ డబ్బును కోర్టులో జమ చేస్తారు. తక్కువ మొత్తంలో దొరికిన డబ్బును రెవెన్యూ అధికారుల వద్ద జమ చేస్తారు. ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజలు ఎన్నికల నిబంధనలను పాటించాలని, అనవసర ఇబ్బందులు లేకుండా ఉండేందుకు నగదుకు సంబంధించిన తగిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**సరైన పత్రాలు ఉంటేనే అనుమతి**
అత్యవసర వైద్యం, కళాశాల ఫీజులు, వ్యాపారం, పెళ్లిళ్లు వంటి ముఖ్యమైన అవసరాలకు పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేవారు తప్పనిసరిగా సరైన ఆధారాలు వెంట ఉంచుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ పత్రాలను చూపించగలిగితే.. జప్తు చేసిన డబ్బును తిరిగి ఇస్తారు.

**అధికారులకు చూపించాల్సిన ఆధారాలు:**
బ్యాంకు లావాదేవీల్లో నగదు డ్రా చేసిన అకౌంట్ పుస్తకం లేదా ఏటీఎం చీటి...
వ్యాపార లావాదేవీల్లో వస్తువులు లేదా ధాన్యం విక్రయించిన డబ్బు అయితే దానికి సంబంధించిన బిల్లులు...
ఆస్తి లావాదేవీల్లో భూమి విక్రయించిన సొమ్ము అయితే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు...
వ్యాపారం లేదా సేవల ద్వారా వచ్చిన డబ్బు అయితే లావాదేవీల పూర్తి వివరాలు సమర్పించాలి.

# భాల్ని ధర్మారం గ్రామం లో తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో సద్దుల బతుకమ్మ వేడుకలు.

**- చిన్న పెద్ద తార తుమ్యం భేదం లేకుండా సంబరంగా జరుపుకున్నా అతిపెద్ద వేడుక.**



**అక్షర వేదం/భాల్ని ధర్మారం గ్రామం, మరిపెడ మండలం:- సెప్టెంబర్ 29.**
నేడు భాల్ని ధర్మారం గ్రామం లో రామాలయం గుడి దగ్గర ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహం దగ్గర నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నేడు చివరి రోజు అయిన సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి.చిన్నా పెద్ద తార తమ్యం భేదం లేకుండా అందరూ ప్రతి ఒక్కరూ ఆనందంగా డాన్స్ లతో కొలాటాలతో బతుకమ్మ పాటలతో మరింత సందిడిగా సంప్రదాయ పద్ధతిలో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.గ్రామ పెద్దలు చిన్నలు అందరి నోటా నేడు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం మా గ్రామాన ఇదే మొదటిసారి ఇలా ప్రతిసంవత్సరం కూడా శ్రీ జగన్మాత నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుందాం అని గ్రామ పెద్దలు నిర్ణయించుకున్నారు.ఈ సంబరాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసిన గ్రామ యూత్ అసోసియేషన్ ఉత్సవ కమిటీ సభ్యులకు గ్రామ సభ్యుల అందరి తరుపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు కమిటీ సభ్యులకు.

# జాతీయ స్థాయి అవార్డులు గెలిచిన టెంపెస్ట్ అడ్వర్టైజింగ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (అక్షర వేదం) :**
భారత్‌లోని ప్రముఖ స్వతంత్ర క్రియేటివ్ ఏజెన్సీలలో ఒకటైన టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ కేవలం రెండు వారాలలో జాతీయ స్థాయిలో వరుసగా పురస్కారాలను గెలుచుకుని విజయ పరంపరను కొనసాగిస్తోందని టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ మేనేజింగ్ డైరెక్టర్ తురాబ్ లక్డావాలా సోమవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గత వారం, ప్రతిష్టాత్మకమైన మేడ్డీస్-2025 అవార్డ్స్‌లో తమ ప్రభావవంతమైన 'ఫాస్ట్ ఫ్యాషన్' ప్రచారానికి సిల్వర్ గెలుచుకున్న టెంపెస్ట్, ఇప్పుడు పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పి.ఆర్.సీ.ఐ) వారి చాణక్య అవార్డ్స్ 2025లో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికైందని తెలిపారు. ఇది, ఒక ఉన్నతమైన లక్ష్యంతో కూడిన క్రియేటివిటీ ప్రయాణంలో టెంపెస్ట్‌కు ఒక గొప్ప గుర్తింపుగా నిలిచిందని అన్నారు. ఈ ప్రధాన పురస్కారంతో పాటు, టెంపెస్ట్ ఇవాళ జరిగిన పి.ఆర్.సీ.ఐ అవార్డ్స్ 2025లో వివిధ విభాగాలలో 1 గోల్డ్, 4 సిల్వర్ అవార్డులను కూడా గెలుచుకుందని తెలిపారు. ఇది టెంపెస్ట్ సృజనాత్మకతను, ప్రభావాన్ని చాటి చెబుతోందని తెలిపారు. ఈ విజయాలన్నీ తాము ప్రతి ప్రచారానికి తీసుకువచ్చే పట్టుదల, నిజాయితీని ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ విజయాలు హైదరాబాద్, బెంగళూరు, పుణె, ముంబైలలో ఉన్న టెంపెస్ట్ నాలుగు కార్యాలయాలలో ఉన్న లోతైన సహకార సంస్కృతికి నిదర్శనం అన్నారు.

# ఏడుపాయల్లో వైభవోపేతంగా శరనవరాత్రి ఉత్సవాలు..!

**-సరస్వతి దేవి రూపంలో అమ్మవారి దర్శనం..**
**-ఉత్సవాల్లో భాగంగా బోనాలు సమర్పించిన భక్తులు...**
**-పాల్గొన్న మెదక్ ఎమ్మెల్యే సతీమణి శివాని...**
**-నేడు దుర్గాదేవిగా దర్శనం ఇవ్వనున్న అమ్మవారు..**



**పాపన్నపేట, అక్షర వేదం**
తెలంగాణ రాష్ట్రంలో రెండో వన దుర్గ మాత ఆలయంగా పేరుగాంచి భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం ఏడుపాయల వన దుర్గామాత సన్నిధిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి ఇందులో భాగంగా సోమవారం ఎనిమిదవ రోజు సప్తమి పురస్కరించుకొని దుర్గ మాత అమ్మవారు సరస్వతి దేవి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని తెలుపూ రంగువస్త్రాలతో అలంకరించి, వేకువజామునే ఆలయ అర్చకులు రవి కోటి పార్దివ శర్మ రాజగోపురంలో వన దుర్గ అమ్మవారికి మంజీరా జలాలతో ప్రత్యేక అభిషేకం, సహస్రనామార్చన, కుమార్చన,గణపతి పూజతోపాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి హారతినిచ్చారు సందర్భంగా స్థానిక మెదక్ ఎమ్మెల్యే సతీమణి మైనంపల్లి శివాని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ జిల్లాల నుండి భారీగా భక్తులు తరలివచ్చారు అనంతరం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవాకి బోనాల కార్యక్రమం నిర్వహించరు ఈ కార్యక్రమం స్థానిక గోకుల్ షెడ్డు నుండి మేళ తాళాలు,డోలు బాజాలు,డప్పు చప్పుళ్ళు, పోతరాజుల నృత్యాలు, నడుమ పురవీధుల గుండా రాజగోపురం వద్దకు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే సతీమణి మైనంపల్లి శివాని, మరియు జోగిని రాధిక,బోనమెత్తుకొని ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా,దుర్గమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని వేడుకలుకునట్లు తెలిపారు
ఈ వేడుకల్లో, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షులు గోవింద్ నాయక్, సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, నాయకులు సాయి రెడ్డి,ఆలయ ఈఓ చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, మండల నాయకులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు

# ప్రస్తుత సమాజంలో ఆత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరం

**- కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టులు ప్రధానం చేసిన డిఎస్పి ప్రసన్నకుమార్**




**సూర్యాపేట , అక్షర వేదం**
ప్రస్తుత సమాజంలో బాల బాలికలకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని ఇది ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందని సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్ అన్నారు. సుమన్ షోటో ఖాన్ కరాటే స్పోర్ట్స్ దూ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ జే.వి. రమణచే శిక్షణ పొందిన కరాటే విద్యార్థులకు సోమవారం స్థానిక బేబీ మూన్ పాఠశాలలో బెల్టులు ప్రశంస పత్రాలు అందజేసి మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలు చెడు మార్గంలో పయనించకుండా కరాటే తో పాటు ఇతర కార్యక్రమాల్లో శిక్షణ ఇప్పించడం ఎంతో అవసరం అన్నారు. కరాటే మాస్టర్ చిన్న ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచడంతో పాటు నేడు శిక్షణ పూర్తి చేసుకొని బెల్టులు అందుకోవడం అభినందనీయమన్నారు. డాక్టర్ రామ్మూర్తి యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ కరాటే విద్యార్థిని విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడంతోపాటు శారీరక దృఢత్వానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. కరాటే శిక్షణ ప్రశంస పత్రాలతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. బాలబాలికలకు కరాటే పోటీల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఇతర పోటీల్లో పాల్గొనేలా చేసి వారి ప్రతిభకు పదును పెడుతున్న కరాటే మాస్టర్ చిన్నాను అభినందించారు. అనంతరం కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు బ్రౌన్ 6, బ్లూ 4, ఆరంజ్ 8, గ్రీన్ 6, ఎల్లో బెల్ట్ లు ఒకటి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ చిన్నతో పాటు కరాటే మాస్టర్లు ఆర్.సంతోష్, రిషికేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ మహాసర్వస్వతి దేవి గా అమ్మవారి అలంకారణ






**- శ్రీ శివ భక్త మార్కండేయ దేవాలయంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలు**
**- ముఖ్య అతిథులుగా కల్వకుర్తి మాజీ శాసనసభ్యుడు జైపాల్ యాదవ్**
**- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**ఆమనగల్, అక్షర వేదం**
అమనగల్ మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవస్థానంలో శ్రీ రాజరాజేశ్వరి దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ మహాసరస్వతిదేవి గా అమ్మవారు దర్శనమిచ్చారు. అయిలబోయిన గాయత్రి రామకృష్ణ దంపతులు పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కి,రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్.గోలి శ్రీనివాస్ రెడ్డి కి ఆలయ అర్చకులు విజ్ఞయ్ శర్మ తో కలిసి పద్మశాలి సంఘం నాయకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు. ఎంగలి బాలకృష్ణయ్య, కార్యదర్శి అవ్వారి శివలింగం, కోశాధికారి గాజుల సత్యరాములు, యువజన సంఘం అధ్యక్షుడు. మామిడిశెట్టి రవి, ప్రధాన కార్యదర్శి చెరుకు రవి, కార్యదర్శి గుద్దేటి మహేష్ నేత,మహిళ సంఘం అధ్యక్షురాలు. అప్పం అలివేలు, పద్మశాలి సంఘం నాయకులు అప్పం శ్రీను, ఎంగలి యాదగిరి, మసున గిరి, మసున మురళీధర్, ఎంగలి ప్రసాద్, ఎంగలి శ్రీధర్,గాజుల శ్రీను,మామిడిశెట్టి ప్రవీణ్, గుర్రం భద్రయ్య,చిలివేరి వాసు,ఏలే నిరంజన్, పాలది శ్రీను, సిరందాసు గోపి,ఏలే శివకుమార్, కోట రాఘవేందర్, అవ్వారి శ్రీశైలం,అప్పం తిరుపతయ్య, అవ్వారి భిక్షపతి,గోలి శ్రీను,మసున శ్రీనివాసులు, గుర్రం సురేష్,అవ్వారి పాండు,గుజ్జరి ప్రవీణ్,అప్పం శివ, పున్న శ్రీను,బావాండ్ల భాస్కర్,మామిడిశెట్టి శంకరయ్య, బావాండ్ల అంజయ్య,అంకం సత్యం, వనం యాదయ్య, గుద్దేటి శివ, మహిళలు ,భక్తులు,పద్మశాలి సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవి కి ప్రత్యేక పూజలు చేసిన : క్యామ మల్లేష్

**ఇబ్రహీంపట్నం ,అక్షర వేదం**
దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండలం చర్ల పటేల్ గూడ గ్రామంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాతను భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ దర్శించుకొని ప్రత్యేక పూజ నిర్వహించారు.



## ఎలుకచెట్ల తండా సర్పంచ్, ఉప సర్పంచ్ అభ్యర్థులుగా కిషన్ నాయక్, భాషా నాయక్



**అక్షర వేదం /కురవి మండలం :-సెప్టెంబర్ 29.**
ఈ రోజు మహబూబాద్ జిల్లా కొరవి మండలం ఎలుక చెట్ల తండా గ్రామపంచాయతీలో స్థానిక సంస్థల ఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకుల సహకారంతో భూక్యా కిషన్ నాయక్ ని సర్పంచ్ అభ్యర్థిగా గుగులోతు భాష నాయక్ ని ఉపసర్పంచ్ అభ్యర్థులుగా ఎన్నుకోవడం జరిగినది.

## మహాలక్ష్మి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**అక్షర వేదం/వెంకటేశ్వరపల్లి:-సెప్టెంబర్ 29.**
వరంగల్ జిల్లా వెంకటేశ్వరపల్లి స్వయంవ్యక్త శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం (సన్నూరు)లో నిర్వహిస్తున్న శ్రీ మహాలక్ష్మి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం రోజున సరస్వతీదేవి అమ్మవారుగా దర్శనమిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి,ఆలయ అభివృద్ధి కమిటి,ఆలయ అనువంశిక పూజారులు,వికాస తరంగిణి సభ్యులు,సన్నూరు సేవా బృందం తదితరులు పాల్గొన్నారు.ఈ రోజు అమ్మవారిని తెలుపు పట్టువస్త్రంతో అలంకరింపజేసి పులిహోర, కేసరి నైవేద్యంగా సమర్పించి అమ్మవారిపై ఉన్న భక్తిని చాటుకున్నారు.ఈ సందర్భం పురస్కరించుకొని అనువశిక ఆలయ అర్చకులు శ్రీమాన్ ఏ.వి రంగాచార్య ఆ అమ్మగారి దివ్య ఆశీస్సులు భక్తుల ఎడ ఉండటానికి గాను దివ్యంగా పూజా సంకల్పం కావించారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు





**అక్షర వేదం/హైదరాబాద్, మియాపూర్ :-సెప్టెంబర్ 29.**
హైదరాబాద్ జిల్లా మియాపూర్ లోని ఆర్డీబీ కోకోనట్ గ్రోవ్ గ్రేటర్ కమ్యూనిటీలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.ఈ సంబరాలలో పద్మజ, శ్రావ్య,సింధూ,అన్విక,అవని తదితరులంతా ఉయ్యాల పాటలతో సందడి చేసి బతుకమ్మను నిమజ్జనం చేశారు.

## తెలంగాణ రాష్ట్ర ఆడపడుచులందరికీ సదుల బతుకమ్మ శుభాకాంక్షలు



**అక్షర వేదం, సెప్టెంబర్ 29 రామగిరి.**
తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే అతిపెద్ద పండుగ సద్దుల బతుకమ్మ, మహిళలకు ఎంతో ఇష్టమైన పండుగ తెలంగాణ రాష్ట్ర పండుగ, పూలను దైవంగా భావించే పకృతి పండుగ, మనందరి జీవితాలలో వెలుగు నింపాలని, గౌరీ మాత యొక్క అనుగ్రహం తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అందరికీ ఉండాలని కోరుకుంటూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అక్కచెల్లెళ్లకు ఆడపడుచులకు మరియు మంథని నియోజక ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు.



# ఫన్, సీరియస్ ఎలిమెంట్స్‌తో రాజాసాబ్ ట్రైలర్..


## ప్రభాస్ ఫ్యాన్స్‌కు పండగే

టాలీవుడ్ దర్శకుడు మారుతి-గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబోలో వస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ రాజాసాబ్ . హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తున్న ఈ మూవీలో మాళవిక మోహనన్ , ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్, రిద్ధికుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను లాంచ్ చేశారు మేకర్స్.కామెడీ, లవ్, రొమాన్స్, హార్రర్ లాంటి ఎలిమెంట్స్‌తో రాజాసాబ్ ఉండబోతుందన్నట్టు ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. మారుతి ప్రభాస్ నుంచి అభిమానులు ఆశించే అన్ని రకాల ఎంటర్‌టైన్‌మెంట్‌ను సినిమాలో చూపించబోతున్నట్టు అర్థమవుతోంది. రాజాసాబ్ సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో ప్రభాస్ ఇంట్రో సాంగ్‌ను మారుతి టీం ప్రభాస్ బర్త్ డే సందర్భంగా అక్టోబర్ 23న గ్రాండ్‌గా లాంచ్ చేయనుంది. ఇప్పటికే లాంచ్ చేసిన రాజాసాబ్ గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతూ నయా లుక్‌లో కనిపిస్తూ అభిమానులకు విజువల్ ట్రీట్ ఇస్తున్నాడు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. రాజాసాబ్‌లో సంజయ్ దత్ సంజూబాబా పాత్రలో కనిపించబోతున్నాడని తెలియజేస్తూ రిలీజ్ చేసిన పోస్టర్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది.

# ఆ జ్ఞాపకాలను మోయడం మానేశాను..

## అదే నిజమైన ప్రేమ అని అర్థం చేసుకున్నా.. సమంత..

టాలీవుడ్ టాప్ హీరోయిన్ సమంత గురించి చెప్పక్కర్లేదు. ఒకప్పుడు బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో అలరించిన ఆమె.. ఇప్పుడు సినిమాలు తగ్గించేసింది. ఇదిలా ఉంటే.. తాజాగా తన ఇన్ స్టోలో షేర్ చేసిన పోస్ట్ తెగ వైరలవుతుంది. అందులో తనకు నిజమైన ప్రేమ గురించి ఎవరూ చెప్పలేదని తెలిపారు.ముప్పై ఏళ్లలో మహిళలు చూసే ప్రతి విషయం భిన్నంగా ఉంటుందని అన్నారు. 20-30 ఏళ్ల మధ్య ఆలోచనల గురించి తన పోస్టులో రాసుకొచ్చారు. "నేను , నా మేకప్ ఆర్టిస్ట్ తాజాగా ఎన్నో విషయాల గురించి చర్చించుకున్నాం. ఆ చర్చ నన్ను ఆలోచింపజేసింది. ముప్పై ఏళ్ల తర్వాత మీరు ప్రపంచాన్ని చూసే తీరు మారుతుంది."”మీ అందం, అన్నింట్లోనూ మార్పు వస్తుంది. అందుకే జీవితాన్ని ఆస్వాదించాలంటే ఇరవైలలోనూ ఏదైనా చేయాలి. లేదంటే మీకు ప్రతి దానికి సమయం మించిపోయినట్లు అనిపిస్తుంది. 20 ఏళ్ల వయసులో నేను గుర్తింపు కోసం ఆరాటపడ్డాను. ఆ మసంయలో నేను ఎంత కోల్పోయానో ఎవరికీ తెలియదు.’'నిజమైన ప్రేమ మనలోనే ఉంటుందని.. అది బయట నుంచి రాదనే విషయాన్ని ఎవరూ చెప్పలేదు. మనల్ని మనం ప్రేమించుకోవడమే నిజమై ప్రేమ అని తర్వాత అర్థం చేసుకున్నాను. ఇప్పుడు నేను ముప్పై ఉన్నాను. నా ఆలోచనా విధానాన్ని మార్చుకున్నాను.నేను గతంలో చేసిన తప్పుల తాలూకు జ్ఞాపకాలను మోయడం మానేశను. అన్నిటి వెంట పరుగులు పెట్టడం ఆపేశాను. ప్రతి అమ్మాయి కూడా ఇలనే ఉండాలని కోరుకుంటున్నాను. పరుగులు తీయడం ఆపేసి జీవితాన్ని ఆస్వాదించాలని ఆశిస్తున్నాను. అప్పుడే మీరు స్వేచ్ఛగా జీవించగలరు’ అంటూ తన పోస్టులో రాసుకొచ్చింది.





# క్యూట్ ఫొటోలు షేర్ చేసిన రీతూ వర్మ

తెలుగమ్మాయి రీతూ వర్మ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించిన ఈ భామ ఇప్పుడు హీరోయిన్‌గా మారిన సినిమాలు చేస్తోంది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ వరుసగా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. కెరీర్ బిగినింగ్ లో పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటించింది ఈ భామ. ఆతర్వాత సినిమాల్లోకి వచ్చింది. ఎన్టీఆర్ హీరోగా నటించిన బాద్షా సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్ గా హీరోయిన్ చెల్లి పాత్రలో మెరిసింది. ఆ తర్వాత కొంత గ్యాప్ ఇచ్చింది. ఇక హీరోయిన్ గా మారి తొలి సినిమాతోనే ఆకట్టుకుంది. 2013లో ప్రేమ ఇష్క్ కాదల్ అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది రీతూ వర్మ. ఈ సినిమా ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోకపోయినా.. ఈ చిన్నది తన నటనతో మెప్పించింది. ఆతర్వాత నా రాకుమారుడు, ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాల్లో హీరోయిన్ గా చేసి ఆకట్టుకుంది. ఇక 2016లో వచ్చిన పెళ్ళిచూపులు సినిమా ఈ బ్యూటీకి మంచి క్రేజ్ తెచ్చిపెట్టింది. ఆతర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది. నిన్నిలా నిన్నిలా, టక్ జగదీష్, ఒకే ఒక జీవితం, కణం, ఆకాశం, మార్క్ ఆంటోని సినిమాలు చేసింది. ఈ భామ నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాల ఎంచుకుంటూ రాణిస్తుంది. ఇటీవలే శ్రీవిష్ణుతో స్వాగ్ , సందీప్ కిషన్ తో మజాకా సినిమాలు చేసింది. ఈ రెండు సినిమా అంతగా ఆకట్టుకోకపోయినా యావరేజ్ గా మిగిలాయి. ఇప్పుడు ఈ చిన్నది ఓ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందు రానుంది. దేవిక అండ్ డానీ అనే టైటిల్ తో ఈ వెబ్ సిరీస్ రానుంది. ఈ క్రమంలోనే రీతూ వర్మ కొన్ని క్రేజీ ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ ఫోటోలు నెటిజన్స్ ను కట్టిపడేస్తున్నాయి.

# నేచురల్స్ లుక్స్‌లో డింపుల్‌హయతి



అందం అభినయం ఉన్నా కూడా చాలా మంది హీరోయిన్స్ అదృష్టం కలిసి రాక రేస్ లో వెనకపడుతున్నారు. సినిమా అవకాశాలు అందుకుంటున్నా కూడా సరైన హిట్స్ లేక స్టార్ డమ్ తెచ్చుకోలేకపోతున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నప్పటికీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేక పోతున్నారు. వారిలో డింపుల్ హయాతి ఒకరు. అందం అభినయం ఉన్న ఈ గ్లామర్ బ్యూటీ తన వయ్యారంతో ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇక తెలుగు, తమిళ్, హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అంతగా సక్సెస్ అందుకోలేకపోయింది. హీరోయిన్ గానే కాదు.. గెస్ట్ రోల్స్ చేసింది. అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. డింపుల్ హయాతి 2017లో ‘గల్ఫ్’ సినిమాతో సినీరంగంలోకి వచ్చింది. ఆతర్వాత 2019లో యురేక సినిమాలో నటించింది. అయినా కూడా గుర్తింపు రాలేదు. అదే సమయంలో వరుణ్ తేజ్ నటించిన ‘గద్దలకొండ గణేష్’ సినిమాలో ‘జర్ర జర్ర ‘ పాటలో నటించింది. ఈ పాటలో హాట్ లుక్ లో మెరిసి ఆకట్టుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో మరోసారి తన గ్లామర్ తో ఆకట్టుకుంది. చివరిగా రామబాణం అనే సినిమాలో కనిపించింది. కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్. బోగి అనే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాలో డింపుల్ హీరోయిన్ గా ఎంపికైంది. ఇటీవలే ఈ సినిమా నుంచి గ్లింప్స్ విడుదల చేశారు. ఈ సినిమా పై డింపుల్ ఆశలు పెట్టుకుంది. ఈ సినిమాతో ఈ ముద్దుగుమ్మ మంచి విజయాన్ని అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. మరి ఈ చిన్నదానికి హిట్ అందుతుందేమో చూడాలి. సోషల్ మీడియాలో ఈ చిన్నది షేర్ చేసే ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.